క్లుప్తంగా

ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధి వారిలంకలో వెలసిన ధనమ్మతల్లి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం సెలవుదినం కావడంతో మండలంలోని గ్రామాలతో పాటు కొత్తపేట, అయినవిల్లి, పి.గన్నవరం మండలాలకు చెందిన గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గోదావరి తీరాన ఆహ్లాదకరమైన వాతావరణంలో సందడి చేశారు. దూరపు ప్రాంతాలను నుంచి తరలివచ్చిన ఆడపడుచులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి



మండపేట పార్టీ కార్యాలయంలో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: సాంకేతిక సమస్యలను పరిష్కరించి గ్రామాల్లో పేద, మధ్య తరగతి ప్రజలకు వెంటనే ప్రభుత్వ లబ్ధిని అందించాలని పలు శాఖల అధికారులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశించారు. మండపేటలోని తన కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలతో ఎమ్మెల్సీ తోట మమేకమయ్యారు. సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యలతో సతమతమవుతున్న వారు తమ కష్టాలను ఎమ్మెల్సీ తోటతో చెప్పుకున్నారు. అక్కడే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

సీసీ రోడ్డు నిర్మాణం



అంగరలో సీసీ రహదారి నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు

కపిలేశ్వరపురం: అంగర గ్రామ పంచాయతీ కార్యాలయం ఉన్న వీధిని రూ.6.50 లక్షలతో సీసీ రహదారిగా మెరుగుపర్చారు. పంచాయతీ రాజ్ జేఈ డీవీ రాఘవులు ఆధ్వర్యంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆనంద్‌కుమార్ రోడ్డు పనులను ఆదివారం పర్యవేక్షించారు. రూ.5 లక్షల ఎన్ఆర్ఈజీఎస్, రూ.1.50 లక్షలు జనరల్ ఫండ్ మొత్తం 6.50 లక్షలతో రహదారిని నిర్మించినట్టు సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు.

నదురుబాదలో గడప గడపకూ ప్రచారం



నదురుబాదలో ఇంటింటా కరపత్రాలతో ప్రచారం చేస్తున్న శ్రీనివాసరావు

రాయవరం: నదురుబాదలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని బలపర్చాల్సిందిగా శ్రీనివాసరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మెర్ల రామప్రసాద్‌చౌదరి, వెంకట్రావు చౌదరి, వల్లు సూర్యనారాయణ, ఓదూరు సుబ్రహ్మణ్యం, ఉప్పలపాటి జార్జి, చోడె దుర్గాప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు.

సావిత్రీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి



జగన్నాథగిరిలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళలు

కాజులూరు: సావిత్రీబాయిపూలే ఆశయాలను నేటితరం మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని త్సల్లరేవు బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధిని అన్నారు. సావిత్రిబాయిపూలే 127వ వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం జగన్నాథగిరిలో మహిళా మండలి సభ్యులు సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు బయటకు రావాలంటే ఎన్నో ఆంక్షలు ఉండే ఆ రోజుల్లో సావిత్రీబాయి మహిళా పాఠశాలను స్థాపించి ఎందరో బాలికలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారన్నారు. కాజులూరు శివారు చాకిరేవు మెరకలో వైఎస్సార్‌సీపీ నేత పెంకే విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలోనూ బీసీ నాయకులు సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సువ్వారి గోవిందు, పితాని సుబ్రహ్మణ్యం, కడలి రాంపండు పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆమె కీలకం

- నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికం
- అభ్యర్థుల గెలుపోటముల్లో వీరే కీలకం
- రెండు నియోజకవర్గాల్లో 2.17 లక్షల మంది మహిళా ఓటర్లు

రాయవరం: సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ఇక ఎంతో సమయం లేదన్న సంకేతాలు వస్తున్నాయి. దీంతో ఎన్నికల వాతావరణం మొదలైంది. రాజకీయ పార్టీలు కూడా పోరుకు సిద్ధమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇది వరకే ఓటు హక్కు ఉన్న వారు తమ ఓటు ఉందో లేదో ఒకసారి పరిశీలించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రెండు నియోజకవర్గాల్లో...

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటుగా రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాలు ఉన్నాయి. క్లస్టర్ పరిధిలో పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీకి రెండు నియోజకవర్గాల పరిధిలో 4,17,792 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుష ఓటర్లు 2,05,580 మంది ఉండగా, మహిళా ఓటర్లు మహిళా ఓటర్లు 2,12,477 మంది ఉన్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలో ఐదుగురు థర్డ్ జెండర్ ఓటర్లున్నారు.

పురుష ఓటర్లతో పోలిస్తే 6,897 మంది ఓటర్లు అధికంగా ఉన్నారు. మండపేట నియోజకవర్గంలో మండలాల వారీగా కూడా మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. మండపేట మున్సిపాలిటీ, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో కూడా మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉన్నారు. 2019 జనవరి ఒకటో తేదీకి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవడం కోసం నియోజకవర్గంలోని 220 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక నూతన ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. అంతే కాకుండా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సంబంధించిన పేర్ల మార్పులు, చేర్పులతో పాటు, ఓట్ల బదిలీ చేసుకునే అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో నిరంతరం ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.



పెరిగిన ఓటర్ల సంఖ్య

2024 జనవరి 22వ తేదీకి మండపేట నియోజకవర్గంలో 2,17,645 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,11,692 మంది మహిళా ఓటర్లు ఉండగా, 1,05,949 మంది పురుష ఓటర్లు ఉన్నారు. నలుగురు ఇతరులు ఉన్నారు. అలాగే రామచంద్రపురం నియోజకవర్గంలో 2,00147 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుష ఓటర్లు 99,361, మహిళా ఓటర్లు 1,00,785 మంది ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు ఒక్కరు ఉన్నారు.

రెండు నియోజకవర్గాల్లో మున్సిపాలిటీ, మండలాల వారీగా ఓటర్ల సంఖ్య

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
మండపేటఅర్బన్	22,825	25,325	00	48,150
మండపేట రూరల్	30,902	32,632	03	63,537
రాయవరం	25,619	26,957	01	52,577
కపిలేశ్వరపురం	26,603	26,778	0	53,381
రామచంద్రపురం అర్బన్	16,876	18,159	01	35,036
రామచంద్రపురం రూరల్	28,436	28,829	00	57,265
కె.గంగవరం	25,919	25,739	00	51,658
కాజులూరు	28,130	28,058	0	56,188

ప్రతి ఇంటికీ ప్రభుత్వ లబ్ధి



వడ్లమూరులో లబ్ధిదారులకు పథకాల వివరాల పత్రాన్ని అందజేస్తున్న ఎంపీటీసీ పలివెల మధు

కపిలేశ్వరపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి పేదవాడి ఇంటికి ప్రభుత్వ లబ్ధిని చేకూర్చిందని మండలంలో ప్రజాప్రతినిధులన్నారు. ప్రతి ఇంటికీ అందించిన లబ్ధి తాలూకు వివరాల పత్రాన్ని ఆదివారం ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, సర్పంచ్‌ల సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షులు వీధి వెంకటరెడ్డి, కపిలేశ్వరపురం మండల సమాఖ్య అధ్యక్షుడు వాసా కోటేశ్వరరావు, మండల పరిషత్ వైఎస్సార్ సీపీ విప్ పలివెల మధు, పరిషత్ వైస్ ఎంపీపీలు గుణ్ణం భానుప్రసాద్, సాకా శ్రీనివాస్ తదితరులు ఇంటింటి పర్యటన చేస్తూ పత్రాలను అందజేశారు. మండలంలోని 19 గ్రామాల్లోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ ఛైర్మన్లు, వైఎస్సార్ సీపీ నాయకులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సంక్షేమ అందజేసిన తీరును వివరించారు.

మైనారిటీల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ కృషి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట పట్టణానికి చెందిన 50 మంది ముస్లిం సోదరులు ఆదివారం ఎమ్మెల్సీ తోట సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ రబ్బానీ, షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీ ఖాన్ బాబా తదితర ముస్లిం పెద్దల సమక్షంలో పార్టీలో చేరారు. ముస్లిం మైనారిటీల రక్షణ, అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్న తీరును చూసి పార్టీలో చేరినట్టు పట్టణ ముస్లిం యూత్ సభ్యులు అన్నారు. వివిధ పార్టీల్లో ఉన్న తాము మండపేట పట్టణాభివృద్ధికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేస్తున్న కృషికి ఆకర్షితులమయ్యామన్నారు. రబ్బానీ, ఆలీఖాన్‌బాబా మాట్లాడుతూ ముస్లిం సోదరుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట వెంట నడుస్తామన్నారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, మైనారిటీ సెల్ పట్టణ అధ్యక్షులు షేక్ గౌస్, జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ ఇమామ్‌సాహెబ్, సహాస్తే హుస్సేన్, నాయకులు సాధనాల శివభగవాన్, షేక్ సర్కార్, షేక్ ఖాసీం (రాజులు), షేక్ కాలేషా, షేక్ ఖలీల్, షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీ, సయ్యద్ ఖాజాబాబు, సయ్యద్ సాహెబ్, సయ్యద్ రబ్బానీ, సయ్యద్ జీలని, సయ్యద్ గని, సయ్యద్ బాబు, షేక్ ఆరిఫ్, ఎండి తల్హ, షేక్ మదీనా, షేక్ ఇమ్రాన్ పాల్గొన్నారు.



మండపేటలో పార్టీలో చేరిన వారిని స్వాగతిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

వైఎస్సార్ సీపీతో ప్రతి పల్లె అభివృద్ధి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఇప్పనపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి పల్లె, పట్టణం అభివృద్ధి చెందాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట మండలం ఇప్పనపాడులో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయం2 పరిధిలోని బాపనమ్మ ఆలయం నుంచి ప్రారంభమై గ్రామంలోని వీధుల్లో పర్యటించారు. ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ కురుపూడి భవాని, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఎంపీటీసీ వనుం సత్యవేణిలతో కలిసి పర్యటించారు. వారికి మహిళలు హారతి పట్టారు. డప్పు వాయిద్యాలతో గ్రామం సందడి నెలకొంది. ఈఓ పీఆర్‌డీ ఐదం రాజు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. తమ పాఠశాలలను అందంగా మార్చారని, పుస్తకాలు, బ్యాగులను ఉచితంగా అందజేశారని చిన్నారులు ఆయన వద్ద సంతోషాన్ని వ్యక్తం చేశారు. గ్రామంలోని పలు సమస్యలను ప్రస్తావించగా పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ అర్హతే ఆధారంగా పేద, మధ్య తరగతి ప్రజల ప్రభుత్వ సంక్షేమాన్ని అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు తిరుశూల శ్రీను, మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేస్తున్న కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చిన్ని గంగాధర్, తిరుశూల అప్పారావు, వనుం నారాయణ, చింతలపూడి మల్లిబాబు, కొల్లపురాజు, చిక్కాల వీర్రాజు, సచివాలయ కార్యదర్శి సుబ్బారావు, తులా శేషారావు, పిల్లా సూరిబాబు, నాగిరెడ్డి రాంబాబు, ఈదర వీరాస్వామి, అన్నందేవుల చంద్రరావు పాల్గొన్నారు.



ఇప్పనపాడు గ్రామ ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కులపెద్దల మద్దతు కోరిన ఎంపీ బోస్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఆదివారపుపేటలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఆదివారం పర్యటించి పలు కుల సంఘాల పెద్దలను రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ముందుగా గ్రామంలో అధికంగా ఉన్న చేనేతల పెద్ద, మంత్రాల గురువు కలకండ రామలింగేశ్వరరావుకు ఇంటికి వెళ్లి ఆయన మద్దతు కోరారు. అమావాస్య రోజు కావడంతో అక్కడే ఆదివారపుపేట శివబాలయోగీశ్వరులు చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరించారు. అనంతరం బసవేశ్వరస్వామి ఆలయం వద్ద చేనేత పెద్దలను కలసి మద్దతు కోరారు. స్థానిక శెట్టిబలిజ రామాలయం వద్ద శెట్టిబలిజ పెద్దలను, అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత పెద్దలను కలసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో ఎస్సీ, బీసీ వర్గాలకు జరుగుతున్న మేలును ఎంపీ బోస్ వివరించి రానున్న ఎన్నికల్లో తన కుమారుడు సూర్యప్రకాష్‌కు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కిన దొరబాబు, ఎంపీటీసీ బళ్ల సుధాకరరావు, చేనేత నాయకులు ఉప్పు అర్ధనారీశ్వర బులిరాజు, ఇనుమర్తి సూరిబాబు, అల్లక బుజ్జి, అల్లక భాస్కరరావు, మద్దా ఏడుకొండలు, కుడుపూడి శ్రీనివాసరావు, చందకన్న చిట్టి తదితరులు పాల్గొన్నారు.



ఆదివారపుపేటలో శివబాలయోగి చిత్రపటం వద్ద నమస్కరిస్తున్న ఎంపీ బోస్

గ్రామాల అభివృద్ధే ప్రధాన ధ్యేయం

కె.గంగవరం: గ్రామాల అభివృద్ధే ప్రధాన ధ్యేయమని రాజ్యసభ సభ్యుడు(ఎంపీ) పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. మండలంలోని కోట గ్రామ శివారు కోటశేరిలంక గ్రామంలో నూతనంగా సుమారు రూ.20 లక్షల ఎంపీ నిధులతో నిర్మించి సీసీ రోడ్డును ఆదివారం బోస్ శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఓ పక్క గ్రామీణ ప్రాంత ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూనే మరో పక్క గ్రామాలను అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో పనిచేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి వస్తేనే సంక్షేమం, అభివృద్ధి ఉంటుందని ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బత్తుల అప్పారావు, నాయకులు కోటి వెంకట్రావు, పిల్లి శ్రీను తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరించి సీసీ రోడ్డును ప్రారంభించిన ఎంపీ బోస్

పేద మహిళలకు ఆసరా

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఆసరా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): పేద మహిళలకు తన సంక్షేమ పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసరాగా నిలిచారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట పట్టణంలోని ధర్మగుండం చెరువు వద్ద ఉన్న శ్రీసీతారామ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పట్టణానికి చెందిన వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు నాలుగో విడత రుణమాఫీ లబ్ధి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారుల వివరాలను మున్సిపల్ కమిషనర్ బి.రాము వెల్లడించారు. పట్టణంలో 2,435 మంది లబ్ధిదారులకు రూ.4,56,56,250 ఆర్థిక సాయాన్ని వారి ఖాతాలకు జమ చేశారన్నారు. ఛైర్‌పర్సన్ దుర్గారాణి, వైస్ ఛైర్మన్ పిల్లి గణేశ్వరరావు, కోఆర్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, రైసుమిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కౌన్సిలర్లు మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా ఆదుకుంటున్న తీరుపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనా తీరును ప్రశంసించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మేలు చేయాలన్న తపనతో మున్సిపల్ కౌన్సిల్ కృషి చేస్తున్న తీరు అభినందనీయమన్నారు. నాడు వైఎస్సార్, నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే పట్టణంలో సంక్షేమం, అభివృద్ధి జరిగాయన్నారు. వైఎస్సార్ ఆసరా తరహా ఇతర మహిళాభ్యుదయ పథకాలతో మహిళలకు ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. కార్యక్రమంలో షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఆలీఖాన్ బాబా, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ మీగడ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మండపేట పట్టణంలో ఆసరా లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట, ఛైర్‌పర్సన్ దుర్గారాణి

రెండోసారి సీఎంగా జగన్ గెలుపు తథ్యం

కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్

రామచంద్రపురం: పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, రెండోసారి ముఖ్యమంత్రిని చేయటం చారిత్రక అవసరమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. పట్టణంలోని 27వ వార్డు గుల్లవారిపేటలో ఆదివారం ఇంటింటా ప్రచారంలో సూర్యప్రకాష్ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నియోజకవర్గ పరిశీలకులు చింతలపాటి శ్రీనివాసరాజు పాల్గొన్నారు. ఆయా వార్డుల్లో పార్టీ నేతలు, పెద్దలు ఘన స్వాగతం పలికారు. గుల్ల వారి పేటలో స్థానికులు డ్రైన్‌లు, సీసీ రోడ్లు కావాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక అధికారులతో మాట్లాడి వాటికీ పరిష్కారమయ్యే విధంగా ఆయన కృషి చేస్తామని తెలిపారు. ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో విద్య, వైద్యం, మహిళల ఆర్థికాభివృద్ధి వంటి విషయాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. పేద విద్యార్థులు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం అభ్యసించే విధంగా చర్యలు తీసుకుందన్నారు. కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం సీఎం జగన్ పాలనలో సుభిక్షంగా ఉన్నారన్నారు. పేదవారు అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు తిరిగి అవే సంక్షేమ పథకలు అమలు చేస్తాం అంటూ మరోసారి మోసం చేసేందుకు కలసికట్టుగా వస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వార్డు కౌన్సిలర్ కట్టా శ్రీరాములు, వైస్ ఛైర్‌పర్సన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్‌లు బొక్కా సత్యనారాయణ, కోటిపల్లి శివాజీ, బాసిన నాగమణి, వివిధ వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, వార్డు నాయకులు నున్నబోయిన శ్రీరాములు, గుత్తుల వీరన్న శెట్టి, దంగేటి వీరభద్ర రావు, అనసూరి బ్రహ్మారావు తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని గుళ్లవారిపేటలో ఇంటింటా ప్రచారంలో కోఆర్డినేటర్ సూర్యప్రకాష్ తదితరులు

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

కాజులూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, బందనపూడి గ్రామ సర్పంచ్ దేగల తిరుమలవేణి కుమారుడు దేగల నాగేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం బందనపూడికి చెందిన తెలుగుదేశం, జనసేన నాయకులు సుమారు 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి నియోజకవర్గ కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్ పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో సీఎం జగనన్న పాలన ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందన్నారు. నవరత్నాల ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాస్, రామచంద్రపురం పట్టణ మున్సిపల్ ఛైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, గాదంశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి స్వాగతిస్తున్న నియోజకవర్గ కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్ తదితరులు

గడప గడపకూ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



దంగేరులో లబ్ధిదారులకు పథకాలను వివరించి పత్రాలను అందిస్తున్న సమన్వయకర్త శ్రీనివాసరాజు

కె.గంగవరం: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని నియోజకవర్గ సమన్వయకర్త చింతలపాటి శ్రీనివాసరాజు అన్నారు. మండలంలోని ఊడిమూడి, కోటిపల్లి, దంగేరు గ్రామాల్లో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దంగేరులో జరిగిన కార్యక్రమంలో ఆయన ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, పార్టీ నాయకులు ఓబులనేని రాజ్‌కుమార్‌తో కలసి ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి పత్రాలను పంపిణీ చేశారు. ప్రతి పేదవాడి కుటుంబంలో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రానున్న కాలంలో ప్రతి ఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

కాజులూరులో...

కాజులూరు: రాష్ట్రంలో పేదరికం అనుభవిస్తున్న కుటుంబాలకు ఆర్థిక పరమైన తోడ్పాటు అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతోనే సీఎం జగన్ నవరత్నాలను అమలు చేస్తున్నారని నియోజకవర్గ పార్టీ ఎన్నికల పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని అండ్రంగి, కుయ్యేరులో ఆయన, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, ఎంపీపీ మాత భారతి తదితరులు పర్యటించి నాయకులు, కార్యకర్తలు ప్రజలను కలుసుకున్నారు. పార్టీ కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి జగనన్న పథకాల ద్వారా పేదలకు కలుగుతున్న లబ్ధిని వివరిస్తూ వాటిని వారు మరింత సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించారు. సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాత నూకరావు, వీరభద్రరావు, మాత మురళి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌ను హత్య చేసిన నిందితుల్ని శిక్షించాలి



ఎస్సై బాషాకు వినతిపత్రం అందిస్తున్న ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ సభ్యులు

కె.గంగవరం: విశాఖ జిల్లా మధురవాడకు చెందిన ఫొటోగ్రాఫర్ సాయిని కిరాతకంగా హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మండల ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఎస్సై జానీబాషాకు వినతిపత్రం అందించారు. మండల ఫొటోగ్రాఫర్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంబటి సుబ్రహ్మణ్యం, జిల్లా మెంబర్ కనకరత్నం మాట్లాడుతూ ప్రభుత్వ సాయి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఫొటోగ్రాఫర్లకు భద్రత కలిగించాలని, విలువైన కెమెరాలను అపహరించి చంపిన హంతకులను కఠినంగా శిక్షించాలని కోరారు. సభ్యులు కాదా శ్రీనివాసరావు, పోతుల విజయకుమార్, సంతోష్, శ్రీనివాస్, శ్రీరామ్, రమేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కపిలేశ్వరపురం (మండపేట): అర్తమూరులో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అందుకోసం శ్రీవారి భక్త మండలి ఛైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ఘనంగా ఏర్పాట్లు చేసింది. ఆధ్యాత్మికతకు నిలయమైన అర్తమూరులో ఏటా శ్రీవారి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా 400 మందికి పైగా గోవిందమాలధారులు స్వామివారి సేవలో పాల్గొంటారు. ఈ నెల 18వ తేదీ వరకూ జరిగే వేడుకల్లో భాగంగా తొలిరోజు మాలధారణతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయని బులిస్వామిరెడ్డి తెలిపారు. ప్రతిరోజు తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మాలధారులకు ప్రతిరోజు భిక్ష, అల్పాహారం ఏర్పాటు చేస్తామని బులిస్వామిరెడ్డి తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకలు విజయవంతం చేయాలని బులిస్వామిరెడ్డి కోరారు.

రామచంద్రపురం సీటును కాపులకు కేటాయించాలి

రామచంద్రపురం: రామచంద్రపురం నియోజకవర్గంలో పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించాలని కాపు సంఘం నాయకులు ఆదివారం రామచంద్రపురం పట్టణంలో సమావేశం నిర్వహించి డిమాండ్ చేశారు. పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉండగా అందులో మూడు ఎస్సీ రిజర్వుడు స్థానాలు పోగా మిగిలిన నాలుగు స్థానాలు జనరల్ స్థానాలన్నారు. వీటిలో ఇప్పటికే ముమ్మిడివరం, కొత్తపేట, మండపేట నియోజకవర్గాలు తెలుగుదేశం అభ్యర్థులను ప్రకటించిందన్నారు. మిగిలిన రామచంద్రపురంలో అత్యధిక జనాభా కలిగిన కాపు సామాజికవర్గాన్ని గుర్తించాలని కాపులకు జనసేన టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కాపు సంఘం గౌరవాధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు నారపరెడ్డి బలరాం, నాయకులు వై.వెంకటగిరి, అక్కిరెడ్డి శ్రీనివాసు, కౌన్సిలర్ అంకం శ్రీనివాసు, రామచంద్రపురం కాపునాడు అధ్యక్షుడు నల్లా సుధాకర్, నున్న చిట్టిబాబు, అధిక సంఖ్యలో కాపు యువకులు పాల్గొన్నారు.